ఈ వారం కథ

-జి.వెంకటకృష్ణ



# ఒక వేకువలోకి...

**ప్రమీల సొమ్మ సిల్లి పడుంది... గత రెండు రోజులుగా ఆమె పరిస్థితి అలానే ఉంది.**

**ఆ సాయంకాలం ఆమె భర్త శవం స్మశానానికి వెళ్ళిపోయింది.**

అతనింక లేడనుకొనే కొద్దీ దుఃఖం పెల్లుబుకుతూ వుంది.

బండి మీద వెళ్తున్న భర్తపై బాంబు దాడి జరిగిందని తెల్సి పరుగున హాస్పిటల్‌కి పోయింది మొదలు, భర్త శవంతోపాటు అత్తగారింటికి రావడం దాకా అంతా కలలో లాగానే ఉంది.

ఇప్పటికీ, బాబును ముద్దాడి సాయంత్రమొస్తానని వెళ్ళిన భర్త రూపమే కళ్ళ ముందు మెదుల్తోంది.

'వీల్ల పార్టీలు పాడుగానూ... యట్ల సేతులొచ్చెనమ్మా... సంపనీకె...' ప్రమీల వాళ్ళమ్మ ఏడుస్తోంది.

'యా పార్టీలు నడిపినాడొదినా... వూర్లదాంన్లకి యెబ్బుడూ దూరంగున్యాడే... యాడో వుద్యోగం చేసుకునే టోన్ని సంపిరే...' ప్రమీల వాళ్ళత్త కొడుకును పోగొట్టుకున్న దుఃఖాన్ని పట్టలేకుండా ఉంది.

వీధిలో కుక్కల గుంపు 'ఓ' అంటూ ఒళ్ళు గగుర్పొడిచేలా ఏడుస్తున్నాయి.

'యేయ్... యెవురూ యేడొద్దండి... నెల్లోగా వానింట్లో పీనిగ తీయల్లా... వాని పెండ్లామ్ ముండమోయల్లా...' తాగి జీరబోయిన గొంతుతో మామ ఎర్రారెడ్డి అరుస్తున్నాడు. ఆ గొంతు వింటుంటే ప్రమీల మనస్సు భగ్గున మండుతోంది. 'అంతా నీనించే అయ్యింది... నువ్వు పెట్టిన అగ్గే యిదంతా... వాల్లతోని పార్టీ పెట్టుకోని నా బంగారమంట్లా కొడుకుని బుగ్గిజేస్తివి...'

ప్రమీల పైకి అనలేకపోతున్న మాటలు వాళ్ళత్త అంటోంది.

ఎర్రారెడ్డికీ నారాయణరెడ్డికీ వాళ్ళ తండ్రుల కాలం నుంచీ ఊర్లో పార్టీ వుంటూ వుంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పట్నుంచీ ఎర్రారెడ్డి అధికారానికీ ఆధిపత్యానికీ అడ్డంకి ఏర్పడింది... అధికార పార్టీ అండతో నారాయణరెడ్డి అన్నిటికీ అడ్డు నిలిచాడు. సారాయి కాంట్రాక్టులూ... గనులూ... చేపల చెరువు వేలాలూ... సబ్సిడీలోన్లూ ఒక్కటి కూడా దక్కకుండా పోయాయి. వాళ్ళ అడ్డు తొలగించుకోవాలని చేసిన బాంబు దాడిలో నారాయణరెడ్డి తప్పించుకున్నాడు. ఆ తర్వాత తాడిపత్రిలో వ్యాపారం చేసుకుంటున్న అతని పెద్దకొడుకు దొరికాడు. ఆ నరమేథం కొనసాగింపుగా ఈసారి ప్రమీల భర్త బలయ్యాడు.

'ఆల్లకు పార్టీ లుంటేనేమి... ఆస్తిపాస్తులుండాయి... పొట్టెగాడు గవర్నమెంటు ఉద్యోగస్థుడు... వూరికి దూరంగుంటాడు... యాపార్టీలేమి జేస్తాయి... ఇంతకంటే మంచి సంబంధం దొరకద్దా...' అని ప్రమీల వాళ్ళ నాన్న ఆమె ఇంటర్మీడియెట్ చదువును మధ్యలోనే ఆపేసి ఈ పెళ్ళి చేశాడు. ఇప్పుడు ఆయన అంచనాలన్నీ తలకిందులయ్యాయి.

'ఇవన్నీ యాలబ్బా... యా పార్టీలొద్దని... మీ నాయనికి చెప్పరాదా' అని భర్తను ఎన్నోసార్లు అడిగింది ప్రమీల.

'నీకేం తెలుసులేవే... మా తాతల కాలం నుంచీ ఎట్ల బతికినోల్లం మేం... నిన్నలేక మొన్న తలెత్తినోన్ని చూసి తలొంచుకుంటే... మందిలో మా పరువేం గావల్లా... శాతగానోల్లమని పించుకోవాల్నా... పార్టీలన్నా సేయల్లా... వూరన్నా యిడసల్లా... తప్పదువే...' అనేవాడు. తండ్రికి అండగా నిలబడేవాడు. అతని ఆలోచనలన్నీ పంచుకునేవాడు.

'పంటలు పండితే ఎంత పండుతాయిరా... మనుషులు మన వెంబడి తిరగాల్నంటే... వ్యాపారాలు గావాలా... కాంట్రాక్టులు చెయ్యల్లా... ఈ బొమ్మలాటోని గవర్నమెంటు వొచ్చినాల్నుంచీ అన్నిటికీ అడ్డమైపాయ... మంది వూరికే మనిండ్ల కాడి కొస్తారా, ఆళ్ళకు పనులు చేసి పెట్టాలా... లెక్కలియ్యాలా... రెండోవాడు చూస్తేనా దుడుకు.. యెబ్బుడేమి కొంప మీనకి తెస్తాడో తెలీదు... వానికి యాడన్నా కాంట్రాక్టు పనులు సూడ్రా...'

తండ్రి చెప్పే ఇట్లాంటి మాటలు విని అడిగినప్పుడల్లా డబ్బులిచ్చేవాడు... ప్రమీల డబ్బులే కదా పోనీలే అనుకుంది... కానీ ఇప్పుడు ఏకంగా ప్రాణాలే పోయినాయి.

* * *

రెండు నెలలు గడిచాయి. ఎవరో ఒకరు బంధువులు పలకరించడానికి వస్తూనే ఉన్నారు. వాళ్ళ పరామర్శకు ప్రమీల కళ్ళల్లో తిరిగే నీటిసుడులే సమాధానమవుతున్నాయి. మెల్లమెల్లగా వాళ్ళు చూపే సానుభూతి భరింపరానిదిగా తయారవుతోంది... ప్రమీల తల్లి వైపు బంధువులు ఆమెతో ఏకాంతంగా మాట్లాడాలని చూస్తారు. పక్కకు పిలుచుకొని ఏవేవో అడుగుతారు. ఏవేవో చెప్తారో... అన్నిటినీ తీరికగా వినే ఓపిక ఆమెకు లేదనుకోరు. ఉన్నట్లుండి ఆమె మరిదిని గురించి హెచ్చరిస్తారు.

'వాడు... రౌడీముండా కొడుకు.... కనిపించినోళ్ళంతా గావల్లా... కండ్లకు మదమెక్కి తిరుగుతాంటాడు... వాన్తోని జాగ్రత్తగుండు' అంటారు. ఇంకా...

'ఇక్కడ నువ్వెందుకుంటావు... నీ మొగుని భాగం ఆస్తి ఇప్పిచ్చుకోని అమ్మ దగ్గరికి పో' అంటారు.

వాళ్ళ మాటల మధ్య జీవితాన్ని తలచుకుంటే భయమేస్తుంది. ఎట్లా గడపాలనిపిస్తుంది.

అంతగా అలవాటులేని ఇల్లు ఇది. పట్టుమని పదినాళ్ళు కూడా గడపని ఇల్లు....

ఎప్పుడూ తన ఇంట్లో భర్తతోపాటు, తన స్వంత ప్రపంచంలో గడిపింది.

ఇక్కడంతా ఇరుగు ఇరుగ్గా ఉంది. మనసంతా ఉక్కపోతగా ఉంది. అప్పుడప్పుడూ చచ్చిపోవాలన్పిస్తుంది.

అంతలోనే బాబు గుర్తొచ్చి, వాడి కోసమే బతకాలనిపిస్తుంది. బాబును తండ్రిలేనివాణ్ణి చేసిన ఆ వూరి పార్టీలనీ, మనుషులనీ తిట్టుకుంటుంది. దీనికంతా కారణం నారాయణరెడ్డి అనుకొని అతన్ని చంపాలనేంత కోపమొచ్చి పళ్ళు పటపట కొరుకుతుంది... 'వాడు మనుషుల్ని పెట్టి... అంత దూరమొచ్చి తన భర్తనే చంపాల్నా... మామ లేడా... మరిది లేడా... అనుకుంటుంది. ఎన్ని అనుకున్నా... మళ్ళీ భర్తలేని ప్రపంచంలో ఒంటరిగా బతికేదెట్లా అని క్రుంగిపోతుంది.

'ఇద్దో... నీకు లెటర్....' ఆలోచనలకు అంతరాయంగా ఆమెకు దగ్గరగా వచ్చి తాకుతూ అందించాడు ఆమె మరిది. అతను అంత చనువు తీసుకున్నా ఆమె గుర్తించే స్థితిలో లేదు.

లెటర్ చించింది. ఎవరు రాసారా అనుకుంటూ విప్పింది.

తన మిత్రురాలు శారద.

'నీ భర్త డ్యూటీలో మరణించాడు కాబట్టి నీకు ఉద్యోగం ఇస్తారు. చదువుకున్న దానివి... ఆ ఊర్లో ఎన్ని రోజులుంటావ్... ఉద్యోగానికి అప్లై చేసుకో. ఎవరి నుంచైనా నువ్వు ఆశించాల్సింది సానుభూతి కాదు, నీ కాళ్ళ మీద నువ్వు నిలబడడానికి ఆత్మవిశ్వాసం' ఉత్తరం ఆమెను ఆలోచనల్లోకి నెట్టింది. శారద రాసింది కరెక్టేననుకుంది.

అవును మరి ఈ ఇంట్లో ఎన్ని రోజులుండగలదు? ఈ ఊళ్ళో బాబు చదువు మాటేమిటి?

ఉద్యోగం విషయం అత్తతో చెప్పింది.

'ఆడపిల్లవు ఉద్యోగం సేయడం యాడైతాదమ్మా... పాపోన్ని సూసుకుంటా ఈడే ఉండక... యాల ఆ బాధలన్నీ చెప్పూ... యేమోలే అవన్నీ నాకేం తెలుసుగానీ... మీ మామను అడుగు యేమంటాడో...'

అని విషయం భర్తకు చేరవేసింది.

'కలెక్టరుద్యోగం చేస్తాదంటనా... పెద్ద సదువరి... పదోక్లాస్ సదివినామెకు యేమొస్తాది... అటెండర్‌గానా... యేమొద్దు. పూర్కే ఇంట్లో పడిండమను...'

ప్రమీల ఆయన మాటల్లోని వ్యంగ్యాన్ని భరించలేక పోయింది. అయినా తమాయించుకొని,

'కాదు మామా, ముందు క్లర్క్ పోస్టిచ్చి... రెండేళ్ళలో ఇంటర్ పాస్ కామంటారు. పాస్ఠ అయితే క్లర్క్‌గానే ఉండొచ్చు. నేను అప్లై చేయాలనుకుంటున్నా...'

ప్రమీల గొంతులో స్థిరత్వం గమనించిన... ఆయన అహంకారం దెబ్బతింది. కసువూడుస్తున్న పనిమనిషి పక్క తిరిగి తిట్టడం మొదలుపెట్టాడు.

'యేమే ముండా! కాలికి పరక తగిలిస్తాండావ్ కళ్ళు కన్పియ్యడం లేదేమే... ఆడ ముండలకి కళ్ళు నెత్తికెక్కినయి...'

రుస్తూ బయటకు పోయాడు. ఆయనంటున్నది తననేనని ప్రమీలకు తెలుస్తూనే ఉంది.

ఉద్యోగానికి ఆయనే చెప్పి అప్లై చేయించాల్సిన వాడు... తనెక్కడ వాళ్ల నుంచీ ఎదిగిపోతానోననే ఓర్వలేని తనంతో అడ్డుకుంటున్నాడు... తన కూతుర్నైతే ఇలా అనేవాడా...

తన భర్తా ఇంతే... ఎన్నడూ తన మాట వినడే లేదు. తన కోర్కెలకు విలువియ్యనే లేదు.

'ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీకి కడతానండీ' అంటే 'యేమే చదివి పూర్లేలాల్నా. హాయిగా తిని ఇంట్లో నిద్రపోక' అనే వాడు. ఆయన అవసరాలు తీర్చడం, ఆయన కొనిచ్చిన బట్టలు కట్టుకోవడం, నగలు పెట్టుకోవడం చేస్తే చాలనుకునే వాడు.

మళ్ళీ మామ బైట ఎవర్నో అరుస్తున్నట్లున్నాడు. ఆయన గొంతు వినాలంటేనే కంపరంగా, భయంగా ఉంది.

'యేమే, ఆనా కొడుకు, నీ మొగుడు యాడే... బట్టలు గంజిపెట్టి ఇస్త్రీ చేసుకురారా అనంటే రాకుండుండాడు' గద్దిస్తున్నాడు.

'లేదు రెడ్డీ పని మీన పల్లెకు పాయినాడు. మీ గుడ్డలు నేను రేపు చేసుకొస్తాను' చాకలామె భయం భయంగా చెప్తోంది.

'ంగముండా... మావి తెచ్చేదంకా... పూర్లోల్లవి వుత ...ద్దా... యెయ్ బట్టల మూటలు అరుగు మీదెయ్... మావి తెచ్చిచ్చి తీనకపో...'

చాకలామె మోస్తున్న మూటలు అరుగు మీదేసింది. భర్తను తిట్టుకుంటూ ఇంటికి పోయింది.

ప్రమీల ఆ మాటలన్నీ తననుద్దేశించినవే ననుకుంది. భర్త వుండగా వొకరి నిర్బంధమే ఉండేది. అయినా అది తన ఇల్లు. ఇప్పుడు పరాయింట్లో ఎన్ని నిర్బంధాలో... భర్త వుండగా అంతో ఇంతో సుఖసంతోషాలైనా ఉండేవి. ఇప్పుడవి మచ్చుకైనా లేవు.

'ఆస్తి పంచేదాకా నువ్విడుండాలమ్మా... వీళ్ళు నీకూ నీ కొడుక్కీ యాడన్యాయం చేస్తారోనని భయంగా ఉంది... మన దిక్కు అడిగేటోల్లే లేరు... మీ నాయన చూస్తేనా కాల మైపాయ...' ఆస్తి కోసమైనా ఈ నిర్బంధాల్ని భరించాల్సిందే నంటుంది అమ్మ. తను భరించగలదా... ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు. ఆమె మనసు ఇక్కడ్నుంచి వెళ్ళిపోవాలని గుంజుతుంది.


★ ★ ★

ఓ సాయంత్రం ఇంటి ముందు జీపొచ్చి ఆగింది. ఇద్దరు మనుషులు లోపలికొచ్చి ఎర్రారెడ్డితో గుసగుసగా ఏదో మాట్లాడి హాలుకు ఎదురుగా ఉన్న రూంలోకి పోయి వరిగడ్డి కప్పిన జల్లలు జాగ్రత్తగా బయటికి తెస్తున్నారు. అంతలో ప్రమీల కొడుకు బయటి నుండి పరిగెత్తుకుంటూ వస్తూ... తెస్తున్న జల్లల్లో ఏమున్నాయోనని వాళ్ళ మధ్యకు పోయి వాటిలో చేయి పెట్టి తీసుకోవాలని ప్రయత్నించాడు. జల్లలు మోస్తున్న వాళ్ళు

'దూరం గుండయ్యో... దూరంగుండయ్యో... రెడ్డీ... పట్టుకోండి' అని అరుస్తున్నారు.

ఎర్రారెడ్డి ఆత్రంగా పిల్లవాడ్ని పక్కకు తోసి... అరుపులకు బయటకు వస్తున్న భార్యను కోపంగా చూస్తూ....

'పిల్లగాడ్ని పట్టుకోకుండా యేంచేస్తాండావే... నీయ... దరిద్రపుదానా... కొంపలో ఆడముండలు గాడ్దులు గాస్తాండారా...'



శరీరం పూహించనంత బరువై మొద్దు బారి పోతోంది. మెల్లగా దొంగ కళ్ళతో పాక్కుంటూ వస్తూన్న కొండచిలువ నాలుక చాచి అరికాలును నాకుతోంది. ప్రమీల కాలును వెనక్కు లాక్కోలేకపో తోంది. అది అమాంతంగా కాలును మింగుతోంది...

బయటికొచ్చిన ప్రమీలకు ఏం జరిగిందో అర్థంగాక... 'ఏందత్తా... ఏమున్నాయి జల్లల్లో... మామ అట్లరుస్తున్నాడు'

'అవి బాంబు లక్కయ్యా... పగిలితే ఇంగేమన్నుందా...'

అత్త చెప్తూంటే ప్రమీల వణికిపోయింది. బాంబులుంటాయనీ, వాటితో వీళ్ళకు చాలా అవసరమనీ తెలుసుగానీ వాటిని నడింట్లో ఉంచుకున్నారని తెలీదు.

పిల్లవాడు యేడుస్తూంటే... వాన్ని సముదాయించడమే మరిచింది... బాంబులు పేలనందుకు సంతోషించాలో... ఆ పరిస్థితుల్లో తామున్నందుకు దుఃఖపడాలో అర్థంగాక అచేతనమై పోయింది.

అత్త ఇదంతా మామూలే నన్నట్లూ, ఇవన్నీ భరించాల్సిందే నన్నట్లూ ఉంది. ఇంకా కావాలంటే ఆ బాంబులే పిల్లాడి చేతిలో పెట్టి.

మీ నాయన్ని చంపినోల్ల మీన... నువ్వు కచ్చ తీర్చుకోవాల్రా' అని బాంబులేసేది నేర్చుకోమంటుందేమో! ఈ ఇంట్లో వుంటే గౌరవంగా అర్థవంతంగా బతకాల్సిన తాము ఈ ఇంట్లో భయంకరమైన పరిస్థితుల మధ్యా నిర్బంధాల్లో వుండాల్సి వచ్చింది... ఇప్పటికైనా తాను ఉద్యోగానికి అప్లై చేసుకుంటే బాబుతోపాటు తన బతుకు తాను బతకొచ్చు. ఈసారి అమ్మొస్తే ఆమె వెంబడి ఈ ఇంటి నుండీ బయటపడాలనుకుంది. ఆస్తికోసం ఇన్ని బాధలూ అవమానాలూ పడలేననుకుంది.

★ ★ ★

ప్రమీలకు దినాలు అసహనంగా గడిచిపోతున్నాయి. రాత్రిళ్ళు... భయంకరమైన కలలతో... అభద్రతతో... నిద్రపట్టకుండా ఉన్నాయి... తలలో పేలిపోతున్న బాంబుల్లాంటి మామ మాటలతో... కలల్లో చుట్టేస్తున్న మరిది చూపుల కొండ చిలువలతో... బయటికిరాని గావుకేకలతో... లోపల వత్తిడి వత్తిడిగా ఉంది.

'బయట ఇష్టమొచ్చినట్లు తిరగొచ్చునని ఉద్యోగం చేస్తానంటోంది కొంపలు ముంచే ముండా...' మామ అత్తతో అంటుండగా విన్న మాటలు శూలాలై గుచ్చుకుంటున్నాయి.

'ఆస్తిని పీక్కోని పక్కకు పోవాలని సూస్తాందిరా... ఆస్తినీ దీన్నీ నువ్వే యేస్కోరా... ఇడ్సొద్దూ...' దూరపు బంధువైన ముసల్ది మరిదితో అంటుండగా విన్న మాటలు ప్రమీల గుండెల్లో కోతను పెడుతున్నాయి. అధికారం చెలాయించాలని చూసే మామా, దగ్గర దగ్గరగా వస్తూ అతి చనువు తీసుకుంటూ... కొడుకును ఎత్తుకొని తనకు అందిస్తూ... తనను తాకాలని చూస్తూ... వెకిలిగా వెంటపడుతున్న మరిదీ రాత్రీ పగలూ భయపెడుతున్నారు.

ఒక రాత్రి ఆమె నిద్ర పోతుండగా...

ఓ భయంకరమైన పీడకల...

శరీరం పూహించనంత బరువై మొద్దుబారి పోతోంది. మెల్లగా దొంగ కళ్ళతో పాక్కుంటూ వస్తూన్న కొండచిలువ నాలుక చాచి అరికాలును నాకుతోంది. ప్రమీల కాలును వెనక్కు లాక్కోలేకపోతోంది. అది అమాంతంగా కాలును మింగుతోంది... ఆమె అరవలేక పోతోంది. శరీరాన్ని కదల్చలేక పోతోంది. అంతలో ఆమె మీద ఏదో పడుతున్న వత్తిడి... ఏదో లోకాల నుండీ విన్పిస్తున్న బాబు ఏడుపు... ఉలిక్కిపడి కళ్ళు తెరిస్తే మీద పడుతున్న మరిది....

'రే... కండ్లు మిండ్లు కాన్రాక మదమెక్కి సస్తాండావు గదరా... వదల్రా' విదిలించి కొట్టింది.

ఆమె అరుపులకు నోరు మూయాలని చూశాడు.

అంతలో బయట పడుకున్న అత్త

'యేం... ప్రమీలమ్మా... ఏమైంది...' అంటూ లేచిన చప్పుడైంది.

ప్రమీలను వదిలేసి మరిది వాకిలి దాటుకుంటూ పరిగెత్తినాడు.

బాబు గుక్క తిప్పుకోకుండా యేడుస్తున్నాడు.

ప్రమీలకు ఏం జరిగిందో అర్థమై నిలువెల్లా వణికిపోయింది.

ఆమె కలల్లో కొండచిలువలూ... ఆ ఇంట్లో క్రూరమృగాలూ...

వీటి మధ్యా తను బతకాలి?

తన ఉనికికి భద్రతలేని చోటా, తను మనిషిగా గుర్తింపబడని చోటా తానుండలే ననుకుంది. ఇక్కడుండడమంటే మరిదికి ఉంపుడుకత్తెగా మారడమే ననుకుంది.

ఆ రాత్రి ఎంతకూ తెల్లవారనే లేదు. ఆలోచనా సుడిగుండాల్లో పడి దొర్లింది.

ఇక్కడ్నుంచీ బయటపడితే తప్ప రేపును చూడలేననీ, అటెండర్ గానైనా సరే స్వతంత్రంగా బతకడంలోనే తనకూ బాబుకూ భవిష్యత్తుందనే నిర్ణయానికొచ్చింది. ఉదయం కాగానే సూట్‌కేసు సర్దుకొని బాబుతో బయల్దేరింది...

'ఈ ఇల్లు వొకసారి ఇడ్సిపోతే మల్లా రాలేవు' ఎర్రారెడ్డి గర్జిస్తున్నాడు.

'చస్తే ఈ ఇంటికి రాను' ప్రమీల తెగించింది.

'ఆస్తిలో రాగినయాపైసా గూడా యీను....'

'ఈ బతుకూ వద్దు... మీ ఆస్తీ వద్దూ... మా బతుకు మేం బతుకుతాం'

ఆత్మవిశ్వాసం నడిపిస్తూంటే... ఆ ఇంటి నుండి బయటపడింది ప్రమీల. ★